ధోబీఘాట్‌లో బోరు ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్‌: ధోబీఘాట్‌కు కేటాయించిన స్థలంలో బోరు వేసి రజకుల జీవనోపాధికి సహకరించాలని శ్రీమేడల ప్రజా రజక సేవా సంఘం అధ్యక్షుడు చంద్రం కోరారు. బుధవారం గాజులరామారం సర్కిల్‌ ఉప కమిషనర్‌ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సూరారం రాజీవ్‌గాంధీ నగర్‌లోని సర్వే నంబరు 79/1లో ధోబీఘాట్‌కు అధికారులు ఒక ఎకరా స్థలం కేటాయించారని తెలిపారు. సరైన నీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు బోరు మంజూరు చేసి జీవనోపాధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్‌, కోశాధికారి రాములు, తిరపతి, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ల బైక్‌ ర్యాలీ



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ క్యాంపస్‌లో కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌లు తమ నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా కాంట్రాక్ట్‌ పద్ధతిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌లను రెగ్యులర్‌ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. 15 ఏళ్లకు పైగా సేవలందించినా ఇంకా రెగ్యులర్‌ చేయకపోవటం తీవ్ర నిరాశకు గురి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యని పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

చెరువు కట్ట చుట్టూ రిటర్నింగ్‌ వాల్‌

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట బోయిన్‌ చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కట్ట చుట్టూ రిటర్నింగ్‌ వాల్‌ ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ తెలిపారు. బుధవారం డివిజన్‌ పరిధిలోని హస్మత్‌పేటలోని హిందు శ్మశాన వాటికలో రూ.కోటి, క్రిస్టియన్‌ శ్మశాన వాటికలో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు, బోయిన్‌ చెరువుకు రూ.కోటి నిధులతో రిటర్నింగ్‌ వాల్‌ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్మశాన వాటికల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. బోయిన్‌ చెరువు అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే వాకింగ్‌ ట్రాక్‌ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం మరో కోటి నిధులు కేటాయించి చెరువు కట్టపైకి వాహనాల రాకపోకలు లేకుండా ఉండేందుకు కట్ట చుట్టూ రిటర్నింగ్‌ వాల్‌తో పాటు కట్టకు అటు ఇటు గేట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే సహకారంతో సీసీ రోడ్డుతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసు స్టేషన్‌కు అటాచ్‌ చేస్తామని తెలిపారు. చెరువు కట్టపై అక్రమ పార్కింగ్‌ వాహనాలను తొలగింపజేస్తామన్నారు. ఎఫ్‌టీఎల్‌లో భవనాల నిర్మాణం చేపట్టినవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని చెప్పారు. పనులు పూర్తి అయితే చెరువు కట్టపైకి వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ఆశ, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీకాంత్‌, వాటర్‌ వర్క్స్‌ మేనేజర్‌ తేజ, బీఆర్‌ఎస్‌ డివిజన్‌ నాయకులు మేకల హరినాథ్‌, గడ్డం నర్సింగ్‌రావు, సయ్యద్‌ ఏజాజ్‌, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, పోచయ్య, రాజుగౌడ్‌, పెంటయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మూసాపేట: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ రేణుక అన్నారు. పోషణ్‌ పక్వాడా కార్యక్రమంలో భాగంగా జనతానగర్‌లోని వడ్డెర బస్తీ 2 సెంటర్‌లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌ వైజర్‌ జ్యోతి, కృష్ణ ప్రియ, సూపర్‌ వైజర్‌, మెడికల్‌ ఆఫీసర్‌ మౌనిక, ఏఎస్‌ఎం సిరాజ్‌, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా కదలాలి

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్‌ రజతోత్సవ సభకు ప్రజలు స్వచ్ఛందంగా కదిలేలా బీఆర్‌ఎస్‌ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కార్పొరేటర్‌లతో టెలీ కాన్ఫరెన్స్‌ ద్వారా మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ పాలనలో ఎంతో మంది నిరుపేదలు పథకాలు ద్వారా లబ్ధి పొందారో, రైతులకు జరిగిన మేలు గురించి ప్రజలకు వివరించాలన్నారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచినీరు, భోజన సదుపాయాన్ని నాయకులు, కార్యకర్తలు దగ్గరుండి చూసుకోవాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల మంచినీటి సదుపాయానికి ఇబ్బందులు రావద్దన్నారు. ఎటువంటి ఇబ్బంది ఉన్నా తనకు ఫోన్‌ చేయాలన్నారు. పది ఏళ్లుగా ఎంతో అభివృద్ధి చేసుకున్న రాష్ట్రం నేడు దివాలా తీస్తుందన్నారు. చెరువులు ఎండి భూగర్భ జలాలు అడుగంటి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

వసూళ్లపై తగ్గిన ఆసక్తి !

శివారు పురపాలికల్లో పన్నుల టార్గెట్‌ రూ.353.66 కోట్లు

- 13 పట్టణాల్లో వసూలైంది రూ.262.92 కోట్లు
- పేరుకుపోయిన బకాయిలు రూ.90.73 కోట్లు
- 21 రోజుల్లో రూ.49.53 కోట్ల రాబడి



పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయం

సాక్షి,సిటీబ్యూరో: పట్టణాభివృద్ధితో సహా సిబ్బంది జీత భత్యాలు, తాగునీటి వీధిలైట్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణకు ఎంతగానో తోడ్పాటును ఇస్తున్న వివిధ రకాల పన్నుల వసూళ్లపై పుర యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా ఆర్థిక సంవత్సరం ముగిసే వరకే నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా పన్నుల వసూళ్లపై దృష్టి సారించాల్సిన పుర కమిషనర్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

◆ నగర శివారు 13 పురపాలిక సంఘాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పన్నుల రూపేణా రూ.353.66 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ, ఇప్పటి వరకు రూ.262.92 కోట్లు మాత్రమే వసూలు చేయకలిగింది. ఆర్థిక సంవత్సరం ముగిసి, దాదాపు నెల కావస్తున్నప్పటికీ, గతేడాది పన్నుల బకాయిలు రూ.90.73 కోట్లు పేరుకపోవడంపై జిల్లా అధికార యంత్రాంగం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

◆ రాష్ట్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్నుల చెల్లించే వారికి 5 శాతం రాయితీ ప్రకటించడంతో ఇప్పటి వరకు విధించిన టార్గెట్‌లో 13.73 శాతం పన్నులు అంటే రూ.49.53 కోట్లు ప్రజలు నేరుగా చెల్లించడంపై అధికార వర్గాల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నెలాఖరు వరకు 5 శాతం రాయితీ వర్తింపు ఉండటంతో ప్రజల నుంచి పన్నుల చెల్లింపులు అంచనా మించగలవన్న ఆశాభావాన్ని వెల్లడిస్తున్నాయి.

13 పురపాలక సంఘాల్లో పన్నులు ఇలా..

నగర శివారు మేడ్చల్‌. మల్కాజిగిరి జిల్లాలో 4 మున్సిపల్‌ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉండగా.. ఈ పట్టణాల్లో ఇంటి పన్నుతో సహా వివిధ పన్నుల రూపేణా వసూలయ్యే నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టేలా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

◆ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో మున్సిపల్‌ కార్పొరేషన్లు బోడుప్పల్‌లో రూ.32.51 కోట్లకు రూ.21.18 కోట్లు (65.15 శాతం) వసూలు కాగా.. పీర్జాదిగూడలో రూ.35.17 కోట్లకు రూ.31.99 కోట్లు (90.90 శాతం) పన్నులు, జవహర్‌నగర్‌లో రూ.14.64 కోట్లకు రూ.9.03 కోట్లు (61.68 శాతం), నిజాంపేట్‌లో రూ.75.21 కోట్లకు రూ.55.22 కోట్లు (73.42 శాతం) పన్నులు వసూలయ్యాయి. మున్సిపాలిటీలు పోచారంలో రూ.26.38 కోట్లకు రూ.19.49 కోట్లు (73.86 శాతం) పన్నులు వసూలు కాగా.. తూముకుంటలో రూ.17.20 కోట్లకు రూ.13.90 కోట్లు (80.79 శాతం), నాగారంలో రూ.23.62 కోట్లకు రూ.18.94కోట్లు (80.18శాతం), మేడ్చల్‌లో రూ.15.87 కోట్లకు, రూ.11.71 కోట్లు (73.77శాతం), కొంపెల్లిలో రూ.16.01 కోట్లకు, రూ.12.64 కోట్లు (78.98శాతం), ఘట్కేసర్‌లో రూ.12.26 కోట్లకు, రూ.7.59 కోట్లు (61.95శాతం), గుండ్లపోచంపల్లిలో రూ.17.26కోట్లకు, రూ.14.82 కోట్లు (85.91శాతం), దమ్మాయిగూడలో రూ.23.20 కోట్లకు,రూ.13.69 కోట్లు (59శాతం), దుండిగల్‌ మున్సిపాలిటీలో రూ.44.26 కోట్లకు, రూ.32.67 కోట్లు (73.82శాతం) పన్నులు వసూలయ్యాయి. జిల్లాలో మొత్తంగా రూ.353.66 కోట్లకు రూ.262.92 కోట్లు (74.34 శాతం) వసూలయ్యాయి.

పన్ను చెల్లింపుపై రాయితీతో రూ.49.53 కోట్లు

13 పురపాలక సంఘాలకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఆస్తి, ఇతర పన్నుల వసూళ్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం 5 శాతం రాయితీ ప్రకటించింది. ఈనెల 30 వరకు ఆస్తిపన్నుతో సహా వివిధ పన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీని పుర యంత్రాంగం కల్పించింది. ఈ నేపథ్యంలో 21 రోజుల్లో 13 పురపాలక సంఘాల నుంచి వివిధ పన్నుల ద్వారా రూ.49.53 కోట్లు (13.73శాతం) వసూలైంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని పురపాలక యంత్రాంగం కోరుతోంది.

పన్ను చెల్లించి.. రాయితీ పొందండి



ఈ ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించి ఆస్తిపన్నుతో సహా ఇతర పన్నులు ఏప్రిల్‌ 30 లోగా చెల్లిస్తే, 5 శాతం వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన పన్ను బకాయిలు సకాలంలో చెల్లించాలి. లేదంటే అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటోంది. పన్నులు సకాలంలో చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– రాధికాగుప్తా, జిల్లా అదనపు కలెక్టర్‌

నేడు జలమండలి అధికారులతో సమావేశం

సుభాష్‌నగర్‌: గాజులరామారం డివిజన్‌ బాలయ్యనగర్‌లో మంచినీటి వాటర్‌ క్యాన్‌ నెంబరు, కనెక్షన్‌ విషయమై స్థానికంగా వాటర్‌ వర్క్స్‌ అధికారులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు బస్తీ అధ్యక్షుడు నాగేష్‌ బుధవారం తెలిపారు. బస్తీ వాసులు డాక్యుమెంటు, ఇంటి నోటరీ పేపర్‌, కరెంటు బిల్లు, ఆధార్‌ కార్డు, ఇంటి ఫొటో, ఆదాయ సర్టిఫికెట్‌ లేదా రేషన్‌ కార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. బాలయ్యనగర్‌ కమ్యూనిటీహాల్‌లో జరిగే వాటర్‌ వర్క్స్‌ అధికారుల సమావేశానికి ఇళ్ల వాసులు తప్పక హాజరు కావాలన్నారు.

ఇంటర్‌ విద్యార్థి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్‌: ఇంటర్‌ విద్యార్థిని మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌ బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లికి చెందిన అశోక్‌రెడ్డి కుమార్తె సుధ ప్రగ్నా(17) ఓ ప్రైవేట్‌ కాలేజీలో ఇంటర్‌ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం ఉదయం 6.15 గంటల సమయంలో అశోక్‌రెడ్డి తన కుమార్తె బెడ్‌రూమ్‌కు వెళ్లగా తలుపులు వేసి ఉన్నాయి. తలుపులు తీయకపోవడంతో అనుమానంతో గది పైభాగంలో ఉన్న కిటికీలోంచి చూశాడు. సుధ సీలింగ్‌ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే తలుపులు పగలగొట్టి ఆమెను కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. ఐఐటీ సంబంధిత సబ్జెక్టుల్లో లక్ష్యం చేరుకోలేక పోతున్న అనే వేదనతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా ర్యాలీలు

నిజాంపేట్‌ : జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఉగ్ర చర్యలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం పెద్ద ఎత్తున ర్యాలీలు, నిరసనలు చేపట్టారు. మృతులకు నిజాంపేట్‌ హనుమాన్‌ టెంపుల్‌ వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆకుల సతీష్‌, అమలేశ్వరి, అరుణ్‌రావు, సుధాకర్‌ రెడ్డి, చందు, జగదీశ్వర్‌, ఎల్లస్వామి, ముఖేష్‌, కావూరి వినయ్‌, నవీన్‌, సుధాకర్‌, కృష్ణారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీలో ఆకుల సతీష్‌ తదితరులు

కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో..

నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కొలన్‌ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సురేంద్ర, వరగాని వాసు, భాస్కరాచారి, ఆంజనేయ వర్మ, ప్రశాంత్‌రెడ్డి, ఇందిరా, ఈరబాబు, నారాయణరెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో..

కుత్బుల్లాపూర్‌: పర్యాటకులపై ఉగ్రదాడి ఘటనను ఖండిస్తూ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో క్యాండిల్‌ ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మతం పేరుతో అమాయకులైన పర్యాటకులను అత్యంత కిరాతకంగా హత్య చేయడం దారుణమన్నారు. కశ్మీర్‌ నుంచి ఉగ్ర మూకలను తరిమికొట్టి సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



కొంపల్లిలో నిర్వహించిన ర్యాలీలో అఖిలపక్ష నాయకులు



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్‌ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కాలనీ వాసులు

ఇంటి తాళాలు పగలగొట్టి ఆభరణాల చోరీ

కుత్బుల్లాపూర్‌: వేర్వేరు ఘటనల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లిన ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల గాయత్రినగర్‌లోని ఎలిగేష్‌ క్యాస్టల్‌ అపార్ట్‌మెంట్‌లో రాజ్‌నారాయణ కుటుంబం నివసిస్తుంది. మంగళవారం ఉదయం రాజ్‌ నారాయణ, అతని భార్య ఉద్యోగానికి వెళ్లారు. రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలు ఇంటికి చేరుకోగా.. తలుపు తాళం పగలగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా లాకర్‌లోని రూ.22 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పేట్‌బషీరాబాద్‌ పోలీసులు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

దూలపల్లి ఎస్సీ కాలనీలో ఉండే సత్యనారాయణ డ్యూటీకి వెళ్లాడు. మధ్యాహ్నం అతని భార్య, పిల్లలు బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో పై అంతస్తులో ఉన్న వారు నీళ్ల మోటార్‌ వేయడానికి కిందికి రాగా.. సత్యనారాయణ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఈ విషయమై సత్యనారాయణ ఫోన్‌ చేశారు. అతని భార్య ఇంటికి వచ్చి చూడగా.. బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

జగద్గిరిగుట్ట: క్వారీ గుంతలో ఈతకు దిగిన విద్యార్థి మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బోరంపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన వెంకట్రావు కుమారుడు మణి సుందర్‌ కుమార్‌ (20) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇద్దరి మిత్రులతో కలిసి మణి గాజులరామారం సమీపంలోని క్వారీ గుంతల్లో ఈత కొట్టేందుకు వెళ్లాడు. గుంతలోకి దిగిన మణి వెనుకకి పడటంతో నీట మునిగాడు. అతని స్నేహితులు స్థానికులకు విషయాన్ని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు డీఆర్‌ఎస్‌ బృందం సహాయంతో క్వారీ గుంతలో గాలింపు చేపట్టారు. సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మణి సుందర్‌కుమార్‌ మృతదేహం

కీ బోర్డ్‌ ప్లేయింగ్‌లో గిన్నిస్‌ వరల్డ్‌ రికార్డు



అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలో నివాసం ఉండే మేడిది లలిత కుమారి, తన ఇద్దరు కుమార్తెలు మేడిది లేషా ప్రజ్ఞ (8), మేడిది అభిజ్ఞ(5)లతో కలిసి గిన్నిస్‌ బుక్‌ ఆఫ్‌ ది వరల్డ్‌ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి చిన్న వయస్సులో ఈ రికార్డు నెలకొల్పడం, అది కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన చిన్నారులు కావటం ఎంతో సంతోషకరమన్నారు. 18 దేశాలకు చెందిన కీబోర్డు సంగీత కళాకారులు పాల్గొన్న కార్యక్రమంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అరుదైన రికార్డు సాధించటం అభినందనీయమన్నారు. డిసెంబర్‌ 1, 2024న గిన్నీస్‌ బుక్‌ ఆఫ్‌ ది వరల్డ్‌ రికార్డ్స్‌ సృష్టించడానికి హోలీ మ్యూజిక్స్‌ స్కూల్‌ విద్యార్థులతో కలిసి గంట వ్యవధిలో ఇన్‌స్టాగామ్‌ వేదికగా వీడియోలు అప్‌లోడ్‌ చేయగా.. లండన్‌లోని గిన్నీస్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డ్స్‌ అధినేత మిస్టర్‌ రిచర్డ్‌ స్టన్నింగ్‌ సంగీత కళాకారులను విజేతలుగా ప్రకటించి డిసెంబర్‌ 9, 2024న లండన్‌ నుంచి జూమ్‌ మీటింగ్‌ ద్వారా వారిని అభినందించారు. ఏప్రిల్‌ 14, 2025న హైదరాబాద్‌లోని మణికొండలో జరిగిన వేడుకల్లో గిన్నీస్‌ వరల్డ్‌ రికార్డ్‌ ప్రతినిధి ఆనంద్‌ రాజేంద్రన్‌, హోలీ మ్యూజిక్స్‌ స్కూల్‌ వ్యవస్థాపకులు అగస్టిన్‌ దండంగి సర్టిఫికెట్‌, పతకాలు అందజేశారు.



చింతల్‌ డివిజన్‌ రోడామేస్త్రీనగర్‌లోని శ్రీమధుర మీనాక్షి ఆలయంలో నిర్వహించిన అభిషేకం, కలశ ప్రతిష్ఠ, కుంబాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్‌ తదితరులు.

– కుత్బుల్లాపూర్‌

క్రమబద్ధీకరణ ఇళ్లకు ఇంటి నంబర్‌ ఇవ్వలేం!

- తేల్చి చెప్తున్న మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారుల
- రెవెన్యూ అధికారులు లెటర్‌ ఇస్తేనే చేస్తామని వెల్లడి
- వెబ్‌సైట్‌ను నిలిపివేయడంతో తమ వద్ద వివరాలు లేవంటున్న రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సామాన్యులు



నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్యాలయం

నిజాంపేట్‌: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి క్రమబద్ధీకరించుకున్న ఇళ్లకు నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారులు కొత్త ఇంటి నంబర్‌, పేర్ల మార్పిడి చేయలేమని తేల్చి చెబుతున్నారు. అనేక నిబంధనలు పెట్టి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం జీవో నం 58, 59 కింద ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించుకున్న స్థలాలను క్రమబద్ధీకరించింది. జీవో 58 ప్రకారం 120 గజాలలో నిర్మాణం చేసి డబ్బులు చెల్లించలేని వారికి ఉచితంగా పట్టాలు ఇచ్చారు. డబ్బులు చెల్లించిన వారికి జీవో 59కు దరఖాస్తు చేసుకుంటే వారికి కన్వినెన్సీ డిడ్‌ ఇచ్చి సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌ చేశారు. ఇలా ప్రభుత్వం నుంచి క్రమబద్ధీకరించుకున్న ప్రజలు తమ తమ ఇండ్లకు కొత్త ఇంటి నంబర్ల కోసం, పేర్ల మార్పిడి కోసం దరఖాస్తు చేసుకుంటే వారిని నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాటికి ఎందుకు ఇవ్వరని ఎవరైన ప్రశ్నిస్తే.. వారి దరఖాస్తును.. ఇవి సరైనా పత్రాలేనా? అని పరిశీలన చేయాలని తహసీల్దార్‌కు లెటర్‌ రాస్తున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన పత్రాలు చెల్లవా?

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఇచ్చిన వాటిని ప్రస్తుతం అధికారులు లెక్కలోకి తీసుకోకపోవడం ఎంత వరకు సమంజసమమని పలువురు ప్రశ్నిస్తున్నారు. తహసీల్దార్‌ కార్యాలయానికి మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారులు లెటర్‌లు రాస్తే.. వారి దగ్గర ఎలాంటి సమాచారం ఉండటం లేదు. ప్రభుత్వం ఈ వెబ్‌సైట్‌ను మూసి వేసిందని, మేము ఎలా? గుర్తించాలని రెవెన్యూ అధికారులు చేతులెత్తుస్తున్నారు. జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో ఏమైనా సమాచారం ఉందేమో? చూడండి అని కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. కలెక్టర్‌ కార్యాలయానికి వెళ్లినా అదే సమాధానం వస్తుందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఈసీ, క్యూఆర్‌ కోడ్‌ చెల్లదా..?

జీవో 58 కింద గత ప్రభుత్వం జారీ చేసిన పట్టాలకు క్యూఆర్‌ కోడ్‌ ఏర్పాటు చేసింది. దాన్ని చెక్‌ చేస్తే పత్రాలు సరైనవేనా?, కాదా? అనేది తేలుతుంది. జీవో 59 కింద క్రమబద్ధీకరించిన స్థలాలను తహసీల్దార్‌ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌ చేశారు. కావున ఈసీ చెక్‌ చెక్‌ చేసినా తెలుస్తుంది. కానీ అధికారుల ఆ వైపు ఆలోచన చేయకుండా విసుగెత్తిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

కొరవడిన అధికారుల సమన్వయం!

మున్సిపల్‌ కార్పొరేషన్‌కు ఇలాంటి సమస్యపై వచ్చే సమయంలో కార్పొరేషన్‌ అధికారులు అటు రెవెన్యూ, ఇటు తహసీల్దార్‌ ఆఫీస్‌ అధికారులను సమన్వయం చేసుకోవాలి. అలా చేయకుండా సామాన్యులను తిప్పలు పెట్టడం ఎంతవరకు సమంజసమని నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం సైతం 58, 59 జీవోలకు సంబంధించిన వెబ్‌సైట్‌లో కనీసం గతంలో రెగ్యులరైజ్‌ చేసుకున్న సమాచారం అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది. సామాన్యులకు కష్టాలు తప్పుతాయి.

గతంలో కొన్ని తప్పులు జరిగాయి



గతంలో కొంత మంది జీవో 58 ద్వారా వచ్చిన పట్టాలను ఫోర్జరీ చేసి ఇంటి నెంబర్‌లు పొందిన విషయం తమ దృష్టికి వచ్చింది. అందుకే ఈ పద్ధతిని నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో అమలు చేస్తున్నాం. దరఖాస్తు చేసుకున్న వారివి ఒరిజినల్‌ పత్రాలా? లేక నకిలీ పత్రాలా? అనే విషయంపై రెవెన్యూ అధికారులు క్లారిటీ ఇవ్వాలని వారికి లెటర్లు రాస్తున్నాం.

– సాబేర్‌ అలీ, మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌